సాక్షి
తిరుపతి

బుధవారం ၊ 9 ၊ ఆగస్టు ၊ 2023



రేపటి నుంచి పలు రైళ్ల రద్దు

గూడూరు- మనుబోలు మధ్య రైల్వే పనుల కారణంగా గురువారం నుంచి పలు రైళ్ల రాకపోకలను రద్దు చేశారు. - 8లో



పేదల భూముల్లో పెద్దల పాగా

చిల్లకూరు మండలంలో పేదలకు పంపిణీ చేసిన భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకున్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	26
చిత్తూరు	36	25
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ బాలాజీ



తిరుపతి అర్బన్ : ఇన్‌చార్జి కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఈ నెల 14వ తేదీ వరకు సెలవుపై వెళ్లడంతో జేసీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. మళ్లీ 15వ తేదీన వెంకటరమణారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి 'నాభూమి-నాదేశం'

తిరుపతి అర్బన్ : ఆజాదీ కా అమృత మహోత్సవ్‌లో భాగంగా బుధవారం నుంచి 'నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 9వ తేదీన వడమాలపేట మండలం టీసీ అగ్రహారంలో మంత్రి ఆర్‌కే రోజా చేతులమీదుగా నాభూమి-నాదేశంను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో 25వ తేదీ వరకు కార్యక్రమాలు కొనసాగనున్నట్లు వివరించారు. అందులో భాగంగా 15వ తేదీ వరకు నాభూమి – నాదేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం నిర్వహించనున్నట్లు చెప్పారు. వసుధకు వందనం కింద పంచాయతీల్లో మొక్కలు నాటడం, స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబాలు, విశేష సేవలందించిన పోలీసులను సత్కరించనున్నట్లు చెప్పారు. 16 నుంచి 20వ తేదీ వరకు నియోజకవర్గస్థాయిలో, 20 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో ఉత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. 30వ తేదీన ఢిల్లీలో కర్తవ్యపథ్‌తో ముగింపు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

రైతు సంక్షేమానికే పథకాలు



మాట్లాడుతున్న ప్రసాద్‌రావు,ప్రేమ్‌కుమార్

తిరుపతి అర్బన్ : రైతుల సంక్షేమానికే ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాద్‌రావు, ప్రణాళికాధికారి ప్రేమ్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పంటసాగు, కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పంట కోతలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు ముందే వివరించాలన్నారు. ఆర్‌బీకేల ద్వారా తెలియజేయాల్సిన అంశాలను తెలిపారు. పంట బీమా, సబ్సీడీపై ఎరువుల పంపిణీ, వాడకం తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ ధనంజయరెడ్డి, ఏడీలు వెంకటేశ్వర్లు,రాజేశ్వరి పాల్గొన్నారు.

బాధ్యతగా బాల శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం

తిరుపతి ఎడ్యుకేషన్: ఇన్‌స్పైర్ మనాక్‌కు విద్యార్థులతో దరఖాస్తులు చేయించి బాల శాస్త్రవేత్తలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఈఓ శేఖర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం డీఈఓ కార్యాలయంలో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ఇన్‌స్పైర్ మక్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరానికి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంస్థ ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల పేరుతో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు నామినేషన్లు సమర్పించాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఐదు , ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు నామినేషన్ల చొప్పున వేయించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, జిల్లా సైన్స్ అధికారి పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఏడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


టైలరింగ్‌లో శిక్షణ

చంద్రగిరి(తిరుపతి రూరల్): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 12 నుంచి ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ అందించనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన తెల్లరేషన్ కార్డు ఉన్న 19 నుంచి 40 ఏళ్ల మహిళలు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం కల్పిస్తామని, రానుపోను ఒక్కసారి చార్జీలు ఇస్తామని చెప్పారు. వివరాలకు 6301717672, 7989680587 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ

తిరుపతి అర్బన్: ఆర్టీసీ డిపో క్లర్క్, గ్యారేజ్ ఇన్‌చార్జిలకు మంగళవారం తిరుపతి ఆర్‌ఎం కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా ఆయిల్ ట్యాంకర్లు వచ్చినప్పుడు డీజిల్ చోరీ కాకుండా డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి జితేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటే ఆయుధం!



ఓటరు జాబితా సవరణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా బీఎల్‌ఓల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. శరవేగంగా కొత్త ఓటర్లను నమోదు చేయిస్తోంది. ఈ క్రమంలోనే జాబితాలో మార్పులు.. చేర్పులు.. తొలగింపులకు వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు పక్కాగా దరఖాస్తులు స్వీకరిస్తోంది. త్వరితగతిన సర్వే పూర్తి చేయించి త్వరలోనే తుది జాబితా ప్రచురణకు సన్నాహాలు చేస్తోంది.

- పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ
- ఇంటింటికీ వెళుతున్న బీఎల్‌ఓలు
- 21లోపు సర్వే పూర్తి చేసేందుకు చర్యలు
- జనవరి 5న తుది జాబితా ప్రచురణకు సన్నాహాలు



తిరుపతిలో సర్వే నిర్వహిస్తున్న బీఎల్‌ఓలు, రెవెన్యూ అధికారులు

తిరుపతి అర్బన్ : ఓటరు సంక్షిప్త సవరణ-2024 ప్రోగ్రామ్ జిల్లాలో శరవేగంగా కొనసాగుతోంది. ఈ మేరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి తప్పులు లేకుండా జాబితాను తయారు చేసేందుకు వివరాలు సేకరిస్తున్నారు. ప్రధానంగా కొత్తగా ఓటర్ల నమోదుతో పాటు మృతి చెందిన వారిని తొలగించడం, తప్పొప్పుల సవరణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. సర్వే ప్రక్రియను ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నారు.

పరిశీలన వేగవంతం

ఓటర్ల పరిశీలనను నెల 21వ తేదీ నాటికి వంద శాతం పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇంటింటి సర్వేను వేగవంతం చేశారు. బీఎల్‌ఓలు ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా పనిచేస్తున్నారు. యువ ఓటర్ల నమోదుకు ఫారం-6, మృతి చెందిన ఓటర్ల తొలగింపు, వివాహం అయిన వారికి మరోచోట ఓటు చేర్చడానికి ఫారం-7, తప్పుల సవరణకు ఫారం-8 ద్వారా జాబితాను తయారు చేస్తున్నారు. 17 ఏళ్ల వారిని సైతం ప్రాస్పెక్టర్ జాబితాలో ఓటర్లుగా నమోదు చేస్తున్నారు. అయితే 18 ఏళ్లు పూర్తి అయిన తర్వాతే ఓటుహక్కును వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నారు.

నియోజకవర్గాల వారీగా పర్యవేక్షణ

నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులను నియమించారు. ఆ మేరకు వారు రోజు సర్వే వివరాలను బీఎల్‌ఓల ద్వారా సేకరిస్తున్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి పూర్తి బాధ్యతను ఈఆర్‌ఓలకే ఎన్నికల కమిషన్ అప్పగించింది. ఈ క్రమంలో ఈఆర్‌ఓలు నియోజకవర్గాల వారీగా సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించే క్రమంలో ఆర్‌డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను ఈఆర్‌ఓలుగా నియమించారు.

అక్టోబర్ 17న ముసాయిదా జాబితా

ప్రత్యేక ఓటరు నమోదు సవరణ-2024లో భాగంగా అక్టోబర్ 17వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. దీనిపై నవంబర్ 30వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు.



శ్రీకాళహస్తిలో సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు

డిసెంబర్ 26వ తేదీ నాటికి అభ్యంతరాల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయనున్నారు. అనంతరం 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమాలను నిర్వహించి ఓటర్ల అభ్యంతరాలను,మార్పులు,చేర్పులపై ఫిర్యాదులు, సలహాలు స్వీకరించడానికి కసరత్తు చేస్తున్నారు. ఆయా పోలింగ్ బూత్‌ల్లోనే మొత్తం ప్రక్రియ జరిపించేందుకు సన్నద్ధమవుతున్నారు.

జిల్లా సమాచారం

నియోజకవర్గాలు	రెవెన్యూ డివిజన్లు
07	03
మొత్తం కుటుంబాలు	ఓటర్లు
6,25,002	17,27,467
పురుషులు	మహిళలు
8.47,049	8,80,181
ట్రాన్స్ జెండర్లు	బీఎల్‌ఓలు
237	2112
ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు	
27,834	
ఫామ్ - 6	ఫామ్-7
11,167	10,408
ఫామ్ - 8	
6,259	

బీఎల్‌ఓలకు సహకరించాలి



బీఎల్‌ఓలకు ఓటర్లు సహకరించాలి. తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారుచేసేందుకు సక్రమంగా వివరాలు అందించాలి. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటును నమోదు చేయించుకోవాలి. ఈ మేరకు బీఎల్‌ఓలను సంప్రదించాలి. మార్పులు, చేర్పులకు సైతం అవకాశం కల్పించాం.

– కోదండరామిరెడ్డి, డీఆర్‌ఓ, తిరుపతి

శేషుడిపై మయూర వాహనుడు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి మంగళవారం రాత్రి శేష వాహనంపై ఊరేగారు. తొలుత ఆలయంలోని అలంకార మండపంలో విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం శేషవాహనంపై స్వామివారిని కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

యాళి వాహనంపై కుమారస్వామి విహారం



యాళివాహనంపై ఊరేగుతున్న దేవదేవేరులు

శ్రీకాళహస్తి: శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి మంగళవారం యాళి వాహనంపై ఊరేగారు. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను యాళి వాహనంపై కొలువదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా భరణి దీపోత్సవం



దీపం వెలిగిస్తున్న ఉభయదారులు



నెమలి వాహనంపై స్వామివారు

పాకాల : మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ ఊట్లవారిపల్లె వద్ద ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. మంగళవారం ఈ మేరకు ఆలయ అర్చకులు వైభవంగా భరణి దీపోత్సవం నిర్వహించారు. ముందుగా ఉదయం యాగపూజ, భరణి అభిషేకం, షణ్ముఖ సహస్రనామార్చన, మహామంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం వైభవోపేతంగా భరణి దీపోత్సవాన్ని చేపట్టారు. రాత్రి స్వామివారిని విశేషంగా అలంకరించి మయూర వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. రాజేంద్రప్రసాద్, మద్దినేని శ్రీనివాసులనాయుడు కుటుంబసభ్యులు, రాయరెడ్డెయ్య చౌదరి, కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎంపీపీ లోకనాథం, సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, చంటి పాల్గొన్నారు. సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ప్రత్యేక బస్సులు

భక్తుల సౌకర్యార్థం ఆనందగిరికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచన మేరకు నెరబైలు నుంచి 3, ఐరాల - 3, రొంపిచెర్ల -5, పీలేరు-5, కల్లూరు-5, సదుం- 3, చంద్రగిరి- 5, సోమల-5, పుంగనూరు - 10 మొత్తం 44 బస్సులను ఊట్లవారిపల్లెకు నడపనుంది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో టీబీసీ వరకు భక్తులు బారులు తీరారు. సోమవారం అర్ధరాత్రి వరకు 69,733 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,614 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 4.37 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

టీటీడీకి కూరగాయలు వితరణ



దాతలకు ప్రసాదాలను అందజేస్తున్న శ్రీవారి భక్తులు

పలమనేరు: కర్ణాటక రాష్ట్రం హొసూరు నుంచి తిరుమల టీటీడీ వెంగమాంబ నిత్యాన్నదాన సత్రానికి పది టన్నుల కూరగాయలను పలమనేరు శ్రీవారి సేవకులు పంపించారు. హొసూరులోని రైతుల నుంచి వీటిని సేకరించి, దాతలకు శ్రీవారి ప్రసాదాలను అందించి కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ వాహనానికి పూజలు నిర్వహించి తిరుమలకు పంపారు.

అభివృద్ధికి ఆమోదముద్ర

- నగరాభివృద్ధిని చూసి భవిష్యత్ తరాలు హర్షించాలి
- 111 అంశాలకు కార్పొరేషన్ కౌన్సిల్ ఆమోద ముద్ర
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి అభినందనల వెల్లువ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి సిటీ: తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ప్రధానంగా 111 అంశాల అజెండాకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేశారు. మంగళవారం ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి హాజరయ్యారు. కార్పొరేషన్ కమిషనర్ హరిత తీర్మానాలను ప్రవేశపెట్టగా, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.కె.బాబు, నరసింహాచారి, గణేష్, ఉమ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు, కాలువలు, డ్రైనేజ్, తాగునీటి సౌకర్యాలను కల్పించే పనులపై ప్రధానంగా చర్చించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ చక్కగా అభివృద్ధి పనులను చేపడుతోందని ప్రశంసించారు. 18 మాస్టర్ ప్లాన్ రోడ్లకు చారిత్రక నేపథ్యంలో పేర్లు పెట్టామని చెప్పారు. తిరుపతి నగర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతిలోని ప్రతి డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తామన్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి టీటీడీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే భూమనకు కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

పరిపూర్ణం.. శ్రీమహాలక్ష్మి యాగం



పూర్ణాహుతి సమర్పిస్తున్న ఘన్‌శ్యామాచార్యజీ మహరాజ్



తెలంగాణ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : రాజస్థాన్ ఝులారియా పీఠాధిపతి 1008వ స్వామీజీ ఘన్‌శ్యామాచార్యజీ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 225 కుండల శ్రీమహాలక్ష్మి మహా యాగ యజ్ఞం మంగళవారం మహా పూర్ణాహుతితో పరిపూర్ణమైంది. ఈనెల 3వ తేదీన ప్రారంభమైన మహాయజ్ఞం అత్యంత ఆధ్యాత్మిక శోభితంగా సాగింది. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులు, పీఠాధిపతులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చివరి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 225 కుండల యజ్ఞ మండపాలలో వేద పండితులు పూజలు నిర్వహించి యజ్ఞోపధారణలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి యాగ మండపం వద్ద నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన యజ్ఞ పూజలు నిర్వహించి పీఠాధిపతి స్వామీజీ ఆశీస్సులు అందుకుని ప్రసాదం స్వీకరించారు. మధ్యాహ్నం శ్రీకన్వెన్షన్ హాల్లో కైలాస్ చంద్రస్వామిజీ చేపట్టిన శ్రీమద్ భాగవత ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో యాగ యజ్ఞ కో-ఆర్డినేటర్ కుప్పాల గిరిధర్‌కుమార్, యాగ కమిటీ సభ్యులు శ్రీధర్, నవీన్ మహేశ్వరి, సంజయ్ సరదా, సంజయ్ మొదని, మధుసూదన్, వేణుగోపాల్, అనురాగ్ జాజు, సొబహుద్ కాకాని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూమన పూజలు

శ్రీ మహాలక్ష్మి మహా యాగ యజ్ఞం ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు. మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఝులారియా పీఠాధిపతి ఘన్‌శ్యామాచార్య మహారాజ్ ఆశీస్సులు అందుకున్నారు.

లాజికల్ థింకింగ్‌తో ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న యండమూరి వీరేంద్రనాథ్

తిరుపతి ఎడ్యుకేషన్ : లాజికల్ థింకింగ్(తార్కిక ఆలోచన)తో పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్కిల్లోని కౌటిల్య విద్యాసంస్థలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు 'స్టెప్ ఫర్ సక్సెస్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి యండమూరి మాట్లాడుతూ స్వీయ జ్ఞానంతో మనలోని శక్తిని తెలుసుకున్నప్పుడే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. లీడర్‌షిప్, కామన్‌సెన్స్, కమ్యూనికేషన్, తెలివి ఉంటే జీవితంలో ఉన్నతంగా రాణించవచ్చని పేర్కొన్నారు. విజయ సాధనలో ఎన్ని అడ్డంకులు, అవాంతరాలు వచ్చినా లక్ష్యం చేరేవరకు విశ్రమించకూడదని సూచించారు. అనంతరం బ్యాంకు, ఎస్ఎస్‌సీ (స్టాఫ్ సెలక్షన్ కమిషన్), క్యాట్ తదితర పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి రవాణాపై ఉక్కుపాదం



ప్రశంసాపత్రం అందుకుంటున్న సెబ్ సీఐ విజయ్‌కుమార్

గూడూరురూరల్ : జిల్లాలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ రాజేంద్ర ఆదేశించారు. మంగళవారం గూడూరు సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పేకాట, కోడిపందేలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. గంజాయి, సారా విక్రేతలపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని స్పష్టం చేశారు. మత్తు పదార్థాలను వినియోగిస్తే వాటిల్లే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన గూడూరు ఎస్ఈబీ సీఐ పి.విజయ్‌కుమార్‌కు సెబ్ కమిషనర్ రవిప్రకాష్ పంపిన ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఎస్వీయూలో 11న జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ డిప్యూటీ చీఫ్ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతీ సుజుకీ, పేటీఎం, గంగోత్రీ ట్రేడర్స్, హరిప్రియ డెంటల్ హాస్పిటల్ తదితర సంస్థల ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొంటారని తెలిపారు. ప్రధానంగా టెక్నీషియన్, క్యాషియర్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డ్రైవర్లు, రిసెప్షనిస్టులు, టెలికాలర్లు, పీఆర్వోలు, డెంటల్ చైర్ అసిస్టెంట్లు తదితర ఉద్యోగాలు భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7989810194లో సంప్రదించాలని కోరారు.

పేదల భూముల్లో పెద్దల పాగా

- హైవే పక్కన ప్రభుత్వ స్థలాల కబ్జా
- యథేచ్ఛగా సాగు చేసుకుంటున్న అక్రమార్కులు
- ఆక్రమణలకు తెరతీసిన టీడీపీ నేతలు
- లేఅవుట్లు వేస్తున్నా పట్టించుకోని అధికారులు
- అగ్రిమెంట్లతో సాగుతున్న క్రయవిక్రయాలు



బూదనం టోల్ గేట్ పక్కన భూమిని చదును చేస్తున్న దృశ్యం

చిల్లకూరు : పేదలకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూములు పంపిణీ చేసింది. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేందుకు సాయం అందించింది. అయితే కొందరు అక్రమార్కులు మాయ మాటలు చెప్పి పేదలను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన భూములను తక్కువ మొత్తం చెల్లించి అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. వాటితోపాటు సమీపంలోని సర్కారు భూములను కలుపుకుని లేఅవుట్లు వేసి విక్రయాలు సాగిస్తున్నారు. మరికొందరు పంటలను సాగు చేసుకుంటూ ఫలసాయం అనుభవిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో సాగరమాల ప్రాజెక్టు కింద రహదారి నిర్మాణం చేపట్టడంతో భూముల ధరకు రెక్కలు వచ్చాయి. ఇదే అదనుగా పలువురు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. పేదలు, ప్రభుత్వ భూముల్లో పాగా వేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలంలోని కడివేడు రెవెన్యూ పరిధిలో భూదనం టోల్ గేట్‌కు సమీపంలోని సర్వే నంబర్ 876లో ఉన్న అరుంధతీయ చెరువు సుమారు 20 ఎకరాల్లో విస్తరించి ఉంది. అందులో పాత మద్రాసు రోడ్డుకు కొంత భాగం పోగా మిగిలిన 15 ఎకరాలలో 2.5 ఎకరాలను కొందరు కబ్జా చేసేశారు. చదును చేసి లేఅవుట్ సైతం వేసేశారు. మరో వ్యక్తి సుమారు 3.5 ఎకరాలను కబ్జా చేసి అందులో పంటలు సాగు చేసుకుంటున్నాడు. అలాగే పత్రగుంట సమీపంలో ఉన్న తెలుగు గంగ కాలువ పక్కన సుమారు 15 ఎకరాలను గతంలో పేదలకు పంపిణీ చేశారు. వీటిపై స్థానిక టీడీపీ నేతలు కన్నేశారు. దళారుల ద్వారా తమ పేర్లు బయటకు రాకుండా చూసుకుని పేదలకు తక్కువ మొత్తం చెల్లించి తమ పేరిటి అగ్రిమెంట్లు రాయించేసుకున్నారు. దీనిపై పలుమార్లు కొందర పేదలు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. టోల్‌గేట్‌కు దగ్గరగా సర్వే నెంబర్ 209-6లో 48 సెంట్లు, 210-3లో 1-53 సెంట్లను గతంలో పేదలకు పంపిణీ చేస్తే వాటిని బడా బాబులు తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వీటిపై ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు మాత్రం రెవెన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు సమాచారం.

"కఠిన చర్యలు తప్పవు కిరణ్‌కుమార్



జాతీయ రహదారి పక్కనే ఉన్న విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదు అందయి. భూముల రీసర్వేలో వీటిని పరిశీలిస్తాం. ఎవరైనా సర్కారు భూములన ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. అలాగే పేదలకు పంపిణీ చేసిన భూములను అగ్రిమెంట్ల పేరుతో కబ్జా చేయాలని చూస్తే కేసులు తప్పవు.

– కిరణ్‌కుమార్, ఆర్డీఓ, గూడూరు

పనులు త్వరితగతిన పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: సూళ్లూరుపేట నియోజవర్గంలోని ఆరు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరిగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అధికారులకు సూచించారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద మంగళవారం పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, తదితర శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా నియోజవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి సమీక్షించారు. పలు మండలాల్లో ఇంతవరకు మొదలు పెట్టని పనులు, అందుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు పలు శాఖ డీఈలు కోటేశ్వరరావు, శ్రీధర్, రమణయ్య, చైతన్య, చంద్రశేఖర్, పరమేశ్వరి, దశయ్య, ప్రసన్నకుమార్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు

పూతలపట్టు: మండలంలోని కొత్తకోట ఐఓసీ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం సర్వీస్ రోడ్డును దాటుతుండగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు స్థానిక రామాపురం రోడ్డుకు చెందిన గిరి పి.కొత్తకోట వైపు నుంచి పూతలపట్టుకు బైక్‌పై బయల్దేరాడు. ఇదేక్రమంలో చిత్తూరు రూరల్ మండలం ముట్టుకూరుకు చెందిన చందు, యోగేష్ వేము ఇంజినీరింగ్ కళాశాలకు ద్విచక్రవాహనంపై వస్తుండగా ప్రమాదం జరిగింది. చందు, యోగేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు.

టీడీపీ నేతల నిరసన

చిత్తూరు రూరల్: పుంగనూరు ఘటనలో అక్రమ కేసులు నమోదు చేస్తున్నారంటూ నగరంలోని దర్గా సర్కిల్‌లో బుధవారం టీడీపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సుమారు 150 మందిపై పోలీసులు కేసులు పెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత నాయకులు మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,180
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,494

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,200
రిటైల్ వెండి గ్రాము	రూ.75.20

ఉనికి కోసమే టీడీపీ ఎత్తుగడ



కలువాయిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

కలువాయి: ప్రజల్లో అభిమానం కోల్పోయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఉనికిని కాపాడుకునేందుకే ముందస్తు ప్రణాళికతో పుంగనూరులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, పోలీసులపై దాడులకు తెగబడ్డారని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. పుంగనూరు ఘటనకు నిరసనగా మంగళవారం కలువాయిలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలి, మనుషుల మనసులు గెలుచుకోవాలి అనే అంశాలను పక్కన బెట్టి, అల్లర్లకు దిగి జనంలో సానుభూతి సంపాదించుకుని తమ ఉనికిని కాపాడుకుందామనే దురుద్దేశంతోనే పుంగనూరులో దాడులకు తెగబడ్డారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కుప్పం నియోజకవర్గంలో వస్తున్న పేరును జీర్ణించుకోలేకనే చంద్రబాబు గొడవలు సృష్టించి లబ్ధి పొందాలని యత్నిస్తున్నారని అన్నారు. ఇది హేయమైన చర్య అని అన్నారు. గతంలో ఆయన ఐదేళ్లు ఏమీ చేయకుండా కార్యకర్తలను సంపాదించుకోమని నీరు-చెట్టు, జన్మభూమి కార్యక్రమాలు చేపట్టారన్నారు. రుణమాఫీ ఎగిరిపోయిందని, ఇప్పుడు కొత్తగా గ్యారంటీ కార్డు అంటున్నారని, వైఎస్సార్ సీపీ పథకాలకు పేరుమార్చి రూపాయి ఎక్కువ ఇస్తామని చెబుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, సర్పంచ్ డి.పెంచలమ్మ, పార్టీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.81 లక్షల సెల్‌ఫోన్లు రికవరీ



మొబైల్స్ ని పరిశీలిస్తున్న ఏఎస్పీ వెంకటరావు

తిరుపతి క్రైం : జిల్లా పోలీసులు సుమారు రూ.81లక్షల విలువైన 450 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు అడ్మిన్ ఏఎస్పీ వెంకటరావు తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లాలో ఫోన్లు పోగొట్టుకున్న వారి కోసం ప్రత్యేకంగా మొబైల్ హంట్ అప్లికేషన్‌తో పాటు వాట్సాప్ నంబర్ 9490617873 అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఎఫ్ఐఆర్ లేకుండానే ఫోన్లను పెద్ద మొత్తంలో రికవరీ చేశామన్నారు. అలాగే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మొబైల్ పోయిన వెంటనే దీంట్లో రియల్ చేస్తే సెల్ ఫోన్ లో ఉన్న సమాచారం మొత్తం దుర్వినియోగం కాకుండా ఉంటుందని సూచించారు. అలాగే మొబైల్‌ని త్వరగా రికవరీ చేసే అవకాశముంటుందని తెలిపారు. అప్లికేషన్ ద్వారా ఫిర్యాదు చేసిన వారిలో ఇప్పటివరకు ఐదు విడతలుగా రెండు కోట్ల 12 లక్షల 40 వేల రూపాయలు విలువచేసే 1,180 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశామన్నారు. ఆరో విడతలో ఇప్పుడు రూ.81 లక్షల విలువైన 450 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బంగా రాష్ట్రాల నుంచి ఎక్కువ మొబైల్స్‌ను రికవరీ చేసినట్లు వివరించారు. సెల్‌ఫోన్ల రికవరీలో సైబర్ క్రైమ్ సీఐ రామచంద్రారెడ్డి, విశేషంగా కృషి చేశారని తెలిపారు. వీరికి రివార్డులు కూడా అందజేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఎస్పీ విమల కుమారి పాల్గొన్నారు.

మత్స్యకారుల నష్టాలు గుర్తిస్తున్నారా..?

- పార్లమెంట్‌లో ప్రశ్నించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి



ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం: మూడేళ్లలో మత్స్యకారులకు సముద్రంలో చేపల వేట ద్వారా కలిగిన నష్టాలను కేంద్ర ప్రభుత్వం నమోదు చేసిందా? ఎక్కువ నష్టాలు సంభవించడానికి గల కారణాలు, దానిని పరిష్కరించడానికి తీసుకున్న చర్యల ఏమిటని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రశ్నించారు. ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంట్ సమావేశంలో మంగళవారం ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. దేశంలోని మత్స్యకారులు అధిక డీజిల్ ధరలతో ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం గుర్తించిందా?, అలా అయితే మత్స్యకార సంఘాలకు డీజిల్ సబ్సిడీని పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తుంటే అందుకు సంబంధించిన కారణాలు తెలపాలని కోరారు. గత మూడేళ్లలో సముద్రంలో చేపల వేట అనంతరం నష్టాలు సంభవించినట్లు మత్స్య మంత్రిత్వ శాఖకి ఎలాంటి నివేదికలు అందలేదని, భారతదేశంలో అత్యధికంగా మత్స్య రంగంలో స్థిరమైన, బాధ్యతాయుతమైన అభివృద్ధి ద్వారా నీలి విప్లవాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎస్ఎస్‌వై)' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని కేంద్ర మత్స్య శాఖా మంత్రి ఈ సందర్భంగా సమాధానమిచ్చారు.

వైభవంగా ఆరాధనోత్సవం



వెంకయ్యస్వామి చిత్రపటం ఊరేగింపు

సైదాపురం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో మంగళవారం ఆరాధనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలుత కలశస్థాపన చేశారు. అనంతరం స్వామివారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం పురవీధుల్లో శ్రీభగవాన్ వెంకయ్యస్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

చిరుపొట్ట దశలో పొటాష్ వేయండి

తిరుపతి అర్బన్: జిల్లాలో సాగు చేసిన వరి చిరుపొట్ట దశకు వస్తుందని, ఈ దశలో ఎకరాకు 35 నుంచి 40 కిలోల యూరియాతోపాటు 20 కిలోల పొటాష్ తప్పక వేయాలని వ్యవసాయ శాఖ జిల్లావనరుల కేంద్రం ఏడీ ఎం భాస్కరయ్య తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పొటాష్ వేయడంతో పంట కోత సమయంలో ధాన్యం జల్లు లేకుండా నాణ్యంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా తెల్లచీడ, మొవ్వ పురుగు తదితర తెగుళ్ల సమస్య తగ్గుతుందన్నారు. పొటాష్ ధర చాలా అధికంగా ఉండడంతో రైతులు పంటలకు ఆ ఎరువు వాడకం తగ్గిస్తున్నారని చెప్పారు. ఈ చర్య పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందని హెచ్చరించారు.

పోలీసులపై దాడి చేసిన కేసులో నలుగురికి జైలు

తిరుపతి లీగల్: విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, వారిపై దాడి చేసిన కేసులో నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రెండేళ్ల జైలుశిక్ష, రూ. 1,500 జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏ సునీతరాణి మంగళవారం తీర్పు చెప్పారు .కోర్టు మానిటరింగ్ అధికారి ఈశ్వర్, కానిస్టేబుల్ శేఖర్ లు కథనం మేరకు.. తిరుపతి ఎంఆర్ పల్లె శాంతినగర్‌కు చెందిన అరగొండ భాను ప్రకాష్, షేక్ ముబారక్, షేక్ తాఫిక్, తిరుపతి ఎస్వీ నగర్‌కు చెందిన సాగిరాజు మోహనకృష్ణ అలియాస్ దినేష్ 2018 నవంబర్ 30వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని ఓ హాస్పిటల్ వెనుక ఖాళీ స్థలంలో ఉన్నారు. ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్‌గా ఉన్న జగన్నాథం, పి.మహాలక్ష్మినాయుడు విధి నిర్వహణలో భాగంగా ఆ ప్రాంతానికి వచ్చారు. అర్ధరాత్రి సమయంలో నలుగురు ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అక్కడి నుంచి వెళ్లాలని సూచించారు. అయితే నలుగురు అక్కడి నుంచి వెళ్లలేదు. కానిస్టేబుల్ మహాలక్ష్మినాయుడు యూనిఫామ్ పట్టుకుని పక్కకు తోశారు. దీంతోపాటు పోలీసులను కించపరుస్తూ మాట్లాడారు. మరో కానిస్టేబుల్ జగన్నాథం వారిని వారించగా నిందితుడు భానుప్రకాష్ రాయితో అతనిపై దాడి చేశాడు. దీంతో కానిస్టేబుల్ జగన్నాథానికి గాయమైంది. క్షతగాత్రుడు రుయా హాస్పిటల్‌లో చికిత్స తీసుకుని ఎస్వీ యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ వేణుగోపాల్ రెడ్డి కేసు దర్యాప్తు చేసి నలుగురిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు. నలుగురిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నలుగురికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ చెవిరెడ్డి శ్రీదేవి వాదించారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



నగదు అందజేస్తున్న దాతలు విజయకుమార్‌రెడ్డి, వసంత

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం అన్నమయ్య జిల్లా నందలూరు గ్రామానికి చెందిన జీ విజయకుమార్‌రెడ్డి, వసంత దంపతులు రూ 50,016 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ అర్చకులు వర్ధన్‌స్వామి మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మల్లికార్జునస్వామి, సిబ్బంది కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పలు రైళ్లు రద్దు

గూడూరురూరల్ : గూడూరు- మనుబోలు మధ్య రైల్వే లైన్ పనుల కారణంగా ఈ మార్గంలో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు పలు రైళ్ల రాకపోకలను రద్దు చేసినట్లు గూడూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట- నెల్లూరు, విజయవాడ- గూడూరు, బిట్రగుంట-చెన్నై, తిరుపతి-గూడూరు మెమో ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసినట్లు చెప్పారు. అలాగే గూడూరు- సికింద్రాబాద్ మార్గంలో నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్, గూడూరు- విజయవాడ మధ్య నడిచే విక్రమ సింహపురి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నెల్లూరు వేదాయపాళెం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతాయని వెల్లడించారు. గూడూరులో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు వేదాయపాళెం రైల్వేస్టేషన్‌కు వెళ్లాలని సూచించారు. అదే విధంగా విజయవాడ- చెన్నై పినాకిని ఎక్స్‌ప్రెస్, జనశతాబ్ది, నర్సాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు వివరించారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరురూరల్ : పట్టణంలోని అరుంధతీయపాళెం వద్ద ఈనెల 4వ తేదీ రాత్రి జరిగిన కొళ్లపూడి వెంకయ్య హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం గూడూరు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో నిందితులు, వారు హత్యకు ఉపయోగించిన మారణాయుధాలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. డీఎస్పీమాట్లాడుతూ తన బంధువుల అమ్మాయితో బిరదవోలు నాని అనే యువకుడికి వివాహేతర సంబంధం ఉందని వెంకయ్య అనుమానించాడన్నారు. ఈ క్రమంలో పలుమార్లు నానిని మందలించినట్లు చెప్పారు. అలాగే వెంకయ్య తన అన్న కొడుకు కొళ్లపూడి ఏడుకొండలతో ఆస్తి విషయమై గొడవపడి కత్తితో గాయపరిచాడని వెల్లడించారు. దీంతో ఏడుకొండలు తన బాబాయ్ వెంకయ్యను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని అరుంధతీయపాళానికి చెందిన తన స్నేహితులు బిరదవోలు నాని, గుండుపాక రవితేజ, గుర్రం చిన్న, యేసుపాక పెంచలయ్య, కొళ్లపూడి తిరుపతయ్యతో కలిసి హత్యకు పథకం వేశారని వివరించారు. ఈ క్రమంలోనే 4వ తేది రాత్రి 10 గంటల సమయంలో వెంకయ్య పీఎస్ఆర్ పార్కు వద్ద ఉన్న విషయం తెలుసుకుని కత్తి, మద్యం బాటిల్‌తో విచక్షణా రహితంగా పొడిచి చనిపోయాడని నిర్ధారించుకున్నాక అక్కడి నుంచి మోటార్ బైక్‌లలో పారిపోయారన్నారు. ఈ హత్య కేసును ఛాలెంజ్‌గా తీసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టామని వెల్లడించారు. గాంధీనగర్ ప్రాంతంలో నిందితులు ఉన్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో నిందితుడు ఏడుకొండలు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. నిందితులపై ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరచిన సిబ్బందికి రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఒకటో పట్టణ సీఐ హజరత్‌బాబు, కానిస్టేబుళ్లు వెంకటేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.